క్లుప్తంగా

మృతుల కుటుంబాలకు పరామర్శ



రేపల్లె రూరల్: అనారోగ్యంతో మృతి చెందిన వైఎస్సార్ సీపీ కార్యకర్తల కుటుంబాలను నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ ఈవూరు గణేష్ మంగళవారం పరామర్శించారు. చెరుకుపల్లి మండలం గుళ్ళపల్లి గ్రామానికి చెందిన బొర్రు శ్రీనివాసరావు మృతి చెందటంతో ఆయన మృతదేహానికి నివాళులర్పించారు. కనగాల గ్రామానికి చెందిన దూపం శంకర రావు మృతదేహానికి కూడా నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి, సానుభూతి తెలిపారు. ఆయా కుటుంబాలకు అండగా ఉంటామని భరోసానిచ్చారు. ఆయన వెంట నగరం, చెరుకుపల్లి మండలాల కన్వీనర్‌లు ఇంకొల్లు రామకృష్ణ, దుండి వెంకట రామిరెడ్డి, నాయకులు తుమ్మా రవికుమార్‌రెడ్డి తదితరులున్నారు.

పశువులు కోసం నీటి తొట్టెలు



కర్లపాలెం: వేసవిలో పశువులు నీరు తాగేందుకు తొట్టెలు ఏర్పాటు చేస్తున్నామని ఎంపీడీవో శ్రీనివాసరావు తెలిపారు. ఏట్రవారిపాలెంలో ప్రధాన రహదారి పక్కన నీటి తొట్టి నిర్మాణానికి మంగళవారం గ్రామ సర్పంచ్ చీరాల వెంకట లక్ష్మి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ఉపాధి హా మీ పథకంలో భాగంగా నల్లమోతువారిపాలెం, ఏట్రవారిపాలెం గ్రామాలలో రూ.32 వేల చొ ప్పున వెచ్చించి తొట్టెలు ఏర్పాటు చేస్తామన్నారు. ఏపీవో మహేష్ పాల్గొన్నారు.

నిత్యావసర వస్తువులు పంపిణీ



పోతుమర్రు (వేమూరు): నిరు పేదలకు నిత్యావసర వస్తువులు ఉచితంగా పంపిణీ చేసినట్లు లూక్ స్వచ్ఛంద సంస్థ మేనేజరు లూసీ తెలిపారు. వేమూరు మండలం పోతుమర్రు గ్రామంలోని 35 మంది వితంతువులకు, వృద్ధులకు, దివ్యాంగులకు మంగళవారం అల్లూరు ప్రసన్న ఆధ్వర్యంలో వీటిని అందించారు. సంస్థ సిబ్బంది కోటయ్య, శివ కీర్తి, ప్రవీణ్, అనూషా, శిరీషా తదితరులు పాల్గొన్నారు.

సాయి లక్కరాజుకు కళాదర్బార్ పురస్కారం

తెనాలి: గుంటూరు బృందావన్ గార్డెన్స్‌లోని వేంకటేశ్వరస్వామి దేవస్థానం ప్రాంగణంలో గల అన్నమయ్య కళావేదికలో కళాదర్బార్ వ్యవస్థాపకులు పొత్తూరి రంగారావు ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం విశ్వావసు నామ సంవత్సర ఉగాది వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ వేడుకల్లో తెనాలికి చెందిన స్వర లయ వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు సాయి లక్కరాజుకి కళారంగంలో చేస్తున్న విశిష్ట కృషికి ఉగాది పురస్కారాన్ని ప్రదానం చేశారు. ఆలయ కార్యదర్శి బి.ఉమామహేశ్వరరావు, చెన్నుపాటి శివనాగేశ్వరరావు, పొత్తూరి రంగారావులు సాయి లక్కరాజును సత్కరించి, ఉగాది పురస్కారాన్ని బహూకరించారు. తనకు జరిగిన సత్కారానికి సాయి లక్కరాజు స్పందిస్తూ తన జిల్లాలో జరిగిన సత్కారం కన్నతల్లి అందించిన అభినందనలతో సమానమన్నారు.

94.71 శాతం పింఛన్లు పంపిణీ

తెనాలిఅర్బన్: సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమం తెనాలి పట్టణంలో మంగళవారం ప్రారంభమైంది. పట్టణంలోని 47 సచివాలయాల పరిధిలో ఉద్యోగులు ఉదయం నుంచే లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పంపిణీ చేశారు. పట్టణంలో మొత్తం 15,023 పింఛన్లకు గాను సాయంత్రం 6 గంటల సమయానికి 14,228 పింఛన్లు పంపిణీ చేసినట్లు మున్సిపల్ అధికారులు తెలిపారు. మిగిలిన పింఛన్లను బుధవారం పంపిణీ చేయనున్నట్లు ప్రకటించారు.

విద్యాసామగ్రి వితరణ



చేబ్రోలు: మండలంలోని వడ్లమూడి విజ్ఞాన్ ఫార్మసీ కళాశాలలోని ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో నారాకోడూరులోని సీఎంఎస్ చిల్డ్రన్ హోంలో ప్లాంటేషన్ ప్రోగ్రాం నిర్వహించినట్లు ప్రిన్సిపల్ పి.శ్రీనివాసబాబు మంగళవారం తెలిపారు. విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు, బుక్స్, ఇతర సామగ్రిని అందించామన్నారు. కళాశాల డీన్లు, అధిపతులు పాల్గొన్నారు.

కాస్త ఆదమరిస్తే కరెంట్ షాకే

పలు చోట్ల ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్లు



ఆంధ్ర రత్న మున్సిపల్ హైస్కూలు ఎదుట...



అంబేద్కర్ పార్కు సమీపంలో..

రేపల్లె రూరల్: పట్టణంలోని పలు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ప్రమాదకర పరిస్థితుల్లో ఉన్నాయి. చార్జీల విషయంలో నిత్యం ప్రజలపై భారం మోపి ముక్కు పిండి మరీ బిల్లుల రూపంలో వసూలు చేస్తున్న అధికారులు... ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ రక్షణ ఏర్పాట్లు చేయడంలో మాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ప్రధాన రహదారుల వెంటే ఈ దుస్థితి నెలకొంది. ఏ సమయంలో ఏ ప్రమాదం జరుగుతుందోనని ప్రజలు భయాందోళనలు చెందుతున్నారు.

ఈ ప్రాంతాల్లో...

- ముఖ్యంగా ప్రకాశం రోడ్డులో అంబేద్కర్ పార్క్ వద్ద ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ అత్యంత ప్రమాదకరంగా మారింది. నిత్యం ఈ మార్గంలో అధిక సంఖ్యలో ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. మూగజీవాల సంచారం అధికంగానే ఉంటుంది. ట్రాన్స్‌ఫార్మర్ ఉన్న సమీపంలోనే పార్కు ఉండటంతో చిన్నారులు ఆడుకునేందుకు ఇటుగా వస్తుంటారు.
- పాత స్టేట్ బ్యాంకు రోడ్డులో ఆంధ్రరత్న ఉన్నత పాఠశాల ఎదుట ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదకరంగా మారింది. ఆంధ్రరత్న స్కూల్‌తోపాటు పలు కార్పొరేట్ స్కూల్స్, ప్రైవేట్ కళాశాలలు ఉన్నాయి. నిత్యం వందల సంఖ్యలో విద్యార్థులు రాకపోకలు సాగించే ఈ మార్గంలో ట్రాన్స్‌ఫార్మర్ దుస్థితిని చూసి విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు.
- బసవేశ్వర థియేటర్ వెనకవైపు, బస్టాండ్ రోడ్డులో, చిన్న మసీదు రోడ్డులో, గరువురోడ్డులో, ఓపెన్ థియేటర్ ఎదురుగా, రామకోటిపేటలో ట్రాన్స్‌ఫార్మర్‌ల రక్షణ కవచాలు శిథిలమయ్యాయి. ప్రమాదాలు సంభవించక ముందే అధికారులు స్పందించాలని ప్రజలు కోరుతున్నారు.



బసవేశ్వర థియేటర్ ఎదుట..



చిన్నమసీదు రోడ్డులో...

వెంటనే రక్షణ చర్యలు తీసుకుంటాం

పట్టణంలో పలు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ల వద్ద రక్షణ కవచాలు మరమ్మతులకు గురైనట్లు మా దృష్టికి వచ్చింది. ఆయా ట్రాన్స్‌ఫార్మర్‌లను గుర్తించి ఫెన్సింగ్ ఏర్పాటు చేయటంపై ఉన్నతాధికారులకు నివేదించాం. అనుమతులు రాగానే ఫెన్సింగ్ ఏర్పాటు చేస్తాం.

– శ్యామ్ సుధాకర్‌బాబు, ఏడీఈ, రేపల్లె

పాస్టర్ మృతిపై నిష్పక్షపాత విచారణ జరపాలి

వైఎస్సార్ సీపీ బాపట్ల జిల్లా క్రిస్టియన్ మైనార్టీ సెల్ అధ్యక్షుడు ప్రభుకిరణ్

రేపల్లె రూరల్: పాస్టర్ పగడాల ప్రవీణ్ మృతిపై నిష్పక్షపాతంగా విచారణ జరిపి నిందితులను కఠినంగా శిక్షించాలని వైఎస్సార్ సీపీ బాపట్ల జిల్లా క్రిస్టియన్ మైనార్టీ సెల్ అధ్యక్షుడు సముద్రాల ప్రభుకిరణ్ డిమాండ్ చేశారు. ఇటీవల అనుమానస్పద స్థితిలో మృతి చెందిన పాస్టర్ పగడాల ప్రవీణ్ సంతాప ప్రార్థన, కొవ్వొత్తుల ప్రదర్శన సోమవారం రాత్రి రేపల్లె పట్టణంలోని ఏఈఎల్‌సీ చర్చి ఆవరణలో నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుకిరణ్ మాట్లాడుతూ... ప్రవీణ్‌ది అనుమానస్పద మృతి అన్నారు. ప్రభుత్వం ఈ మృతిపై విచారణ జరపకుండా నిర్లక్ష్యం వహిస్తోందన్నారు. ప్రవీణ్ కుటుంబానికి న్యాయం చేయటంతోపాటు నిందితులను కఠినంగా శిక్షించే వరకు దళిత సంఘాల ఆధ్వర్యంలో ఆందళన కార్యక్రమాలు చేపడతామన్నారు. ఈ సందర్భంగా పట్టణంలో కొవ్వొత్తులతో శాంతి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు చిత్రాల ఓబేదు, కర్రా రత్నాకర్, పంతగాని రమేష్, తదితరులు పాల్గొన్నారు.



క్యాండిల్ వెలిగించి నివాళులర్పిస్తున్న రేపల్లె పట్టణ పాస్టర్‌లు, క్రైస్తవ సోదరులు

ఊపందుకున్న వేసవి దుక్కులు

బాపట్ల: ఈ ఏడాది ఖరీఫ్ పనులు సకాలంలోనే మొదలయ్యే అవకాశం ఉందని గ్రహించిన రైతులు వేసవి దుక్కులు దున్నేందుకు సన్నద్ధం అయ్యారు. రబీ పంటలుగా సాగు చేసిన మొక్కజొన్న, జొన్న, మినుము పైర్ల చెత్తను పొలాల్లో తగలపెట్టే పనుల్లో రైతులు నిమగ్నం అయ్యారు. పలు గ్రామాల్లో వ్యవసాయ పనులను ప్రారంభిస్తున్నారు. ఏవో చంద్రశేఖర్ మాట్లాడుతూ.. రైతులు పొలాలను సన్నద్ధం చేసుకొని తొలకరిలో వచ్చే వర్షాలకు పచ్చిరొట్ట పైర్లను సాగు చేసుకోవాలన్నారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమయ్యే నాటికి పెసర పంట చేతికి వస్తుందన్నారు. పెసర మొక్కలను పొలాల్లోనే వదిలి కేవలం కాయలు మాత్రమే కోసి చెట్టును భూమిలోనే కలియదున్నితే పచ్చిరొట్ట పైరుగా ఉపయోగపడుతుందన్నారు. రైతులకు 50 శాతం సబ్సిడీపై పెసర, జీలుగ, జనుము విత్తనాలను సరఫరా చేస్తున్నారని పేర్కొన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని పచ్చిరొట్ట పైర్ల సాగుకు శ్రీకారం చుట్టాలన్నారు.



దుక్కు దున్నుతున్న దృశ్యం

పాల దిగుబడిపై ఎండ దెబ్బ

- కొద్దిపాటి జాగ్రత్తలతో పాడి పశువులకు సంరక్షణ
- నిర్లక్ష్యం వహిస్తే తీవ్రంగా నష్టపోయే ప్రమాదం



డాక్టర్ బి.వేణుగోపాల్

బాపట్ల టౌన్: వేసవిలో పాడి రైతులు పశుపోషణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని పశుసంవర్ధక శాఖాధికారులు సూచిస్తున్నారు. ప్రస్తుతం పశువులకు వడదెబ్బ తగిలే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని చెబుతున్నారు. వడదెబ్బ తగిలిన పశువుల్లో పాల ఉత్పత్తి తగ్గడమే కాకుండా, ఎదకు వచ్చే పరిస్థితులు కనిపించవని, చూడి పశువుల్లో గర్భస్రావాలు సంభవిస్తాయని వైద్యులు పేర్కొంటున్నారు. వేసవికాలంలో పశుపోషణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సోకే వ్యాధులను జిల్లా పశుసంవర్ధక శాఖాధికారి డాక్టర్ బి.వేణుగోపాల్ వివరించారు. శ్రద్ధ తీసుకోకుంటే వడదెబ్బకు గురై పశువులు చనిపోయే ప్రమాదం ఉందంటున్నారు. పశు వైద్యశాలకు వెళుతున్న పాడి రైతులకు ఈ మేరకు అవగాహన కల్పిస్తున్నారు.

పాటించాల్సిన జాగ్రత్తలు

పశువులు తాగేనీరు పరిశుభ్రంగా ఉంచాలి. వేసవిలో సహజంగానే నీటి వనరులు తగ్గి, నిల్వ ఉండే నీరు మురికిగా, ఆకుపచ్చగా మారతాయి. పశువులు ఈ కలుషితమైన నీరు తాగితే వ్యాధికారక క్రిములు శరీరంలోకి చేరి పారుడు వ్యాధి బారినపడతాయి. రోజులో కనీసం నాలుగు సార్లు స్వచ్ఛమైన నీటిని అందించడం అవసరం. ఆరు బయట తొట్టిలో పగలు నిల్వ ఉంచిన నీరు వేడి అవుతుంది. నీడ ప్రాంతంలో నిల్వ ఉంచిన చల్లటి నీటిని పశువులకు తాగించాలి. ఆవుతో పోలిస్తే గేదెలు ఎక్కువగా నీటిని తాగుతాయి. ఉష్ణోగ్రత, గాలిలో తేమ, పశువు వయస్సు ఆధారంగా రోజుకు 35 లీటర్ల నీరు అవసరం. పాలిచ్చే ఆవులు అదనంగా ప్రతి లీటర్ పాల దిగుబడికి 4 నుంచి 5 లీటర్ల చొప్పున నీటిని తాగుతాయి.



మేస్తున్న పశువులు

వడదెబ్బ తగలకుండా ఇలా..

పశువుల పాక చుట్టూ పాత గోనె సంచులు, వస్త్రాలు కట్టి వాటిని అప్పుడప్పుడు తడుపుతూ ఉండాలి. పాత రేకులతో వేసినట్టయితే పైకప్పును కొబ్బరి, తాటి ఆకు, వరి గడ్డితో కప్పాలి. మంచినీరు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండేటట్లు చూడాలి. పశువులను ఉదయం, సాయంత్రం మాత్రమే చల్లని వాతావరణంలో మేతకు వదలాలి. వీలైనంత పచ్చని మేతను ఇవ్వాలి.

లక్షణాలు ఇవీ..

శరీర ఉష్ణోగ్రత తీవ్రంగా పెరుగుతుంది. పశువులు నడిచేటప్పుడు తూలుతుంటాయి. శ్వాసక్రియ ఎక్కువగా ఉంటుంది. పశువు చాలా నీరసంగా కనబడుతుంది. ఒక్కొక్కసారి కిందపడి కొట్టుకొని స్పృహ కోల్పోతాయి. చర్మం ఎండిపోయినట్లు ఉంటుంది. పాల ఉత్పత్తి తగ్గుతుంది. ఇటువంటి లక్షణాలు ఉంటే వడదెబ్బ తగిలిందని రైతులు గ్రహించి వెంటనే చల్లని నీటితో పశువు ముఖాన్ని కడగాలి. పలుచటి వస్త్రంలో ఐస్ చుట్టి పశువు నుదుటిపై మెల్లగా రుద్దాలి. కొద్దిగా ఉపశమనం కలిగిన తరువాత దగ్గరలోని పశు వైద్యుడిని సంప్రదించి, వైద్యుల సూచించిన సెలైన్ పెట్టాలి. అనంతరం వైద్యుల సూచనలు, సలహాలు పాటించాలి.

పింఛన్ల పంపిణీ సకాలంలో పూర్తిచేయాలి

కొల్లూరు: ప్రభుత్వం మంజూరు చేసిన పింఛన్లను యంత్రాంగం నిర్దిష్ట సమయంలో పంపిణీ చేసి లబ్ధిదారులకు అండగా నిలవాలని వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు అన్నారు. మంగళవారం మండలంలోని దోనేపూడిలో పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ, పింఛన్ల మంజూరు విషయంలో ప్రభుత్వం పారదర్శకంగా వ్యవహరిస్తుందన్నారు. కార్యక్రమంలో సర్పంచి వాగోలు గౌతమి, టీడీపీ మండలాధ్యక్షుడు మైనేని మురళీకృష్ణ, మాజీ ఎంపీపీ కనగాల మధుసూదన్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నేడు వేమన జయంతి ఉత్సవం

చుండూరు(వేమూరు): చుండూరు మండలంలోని మోదుకూరు గ్రామంలో వేమన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం ఉదయం 10 నుంచి 12.30 గంటల వరకు వేమన జయంతి ఉత్సవాలు నిర్వహించనున్నారు. ఈ మేరకు కమిటీ అధ్యక్షులు తియ్యగూర సీతారామిరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

4న మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

కర్లపాలెం: పిట్టలవానిపాలెం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల 4వ తేదీన ఎంపీపీ దెందుకూరి సీతారామరాజు అధ్యక్షతన మండల పరిషత్ కార్యాలయంలో జరగనుంది. ఈ మేరకు ఎంపీడీవో సత్యనారాయణరావు మంగళవారం ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి జెడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులు, కోఆప్షన్ సభ్యుడు, సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు హాజరుకానున్నారు.

పురుగు మందులు సురక్షితంగా వినియోగించాలి

గుంటూరు రూరల్: ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం, ఎన్విరో ఈక్విటీ హెల్త్ ఇన్షియేటివ్ స్వచ్ఛంద సేవా సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం జొన్నలగడ్డ గ్రామంలోని రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. విశ్వవిద్యాలయం ఏడీఆర్ డాక్టర్ ఎనీవ్వీవీఎస్ దుర్గాప్రసాద్ మాట్లాడుతూ.. రైతులు పంటలపై పురుగు మందులు సురక్షితంగా వాడాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. సేవా సంస్థ ఫౌండర్ శ్రియ జొన్నకూటి మాట్లాడుతూ రైతులను అధునాతన విధానాలపై అప్రమత్తం చేస్తున్నట్లు పేర్కొన్నారు. వ్యవసాయ శాస్త్రవేత్తలు డాక్టర్ సాంబశివరావు, డాక్టర్ దయానా మాట్లాడుతూ రైతులకు ఎక్కువగా ప్రోస్టేట్ క్యాన్సర్, చర్మ సంబంధిత వ్యాధులు వస్తున్నాయన్నారు. పరిధి మించి పురుగు మందులు పిచికారి చేయరాదన్నారు. భవిష్యత్తులో అనేక విధాలుగా నష్టం జరుగుతుందని తెలిపారు. ఆదర్శ రైతు వంగా నవీన్‌రెడ్డి, ఎం. సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

చెన్నారెడ్డి విరచిత స్వప్న సాగరం నవల ఆవిష్కరణ

ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఆంగ్ల విభాగంలో ఆచార్యునిగా సేవలందిస్తున్న ప్రముఖ రచయిత ఆచార్య గుజ్జు చెన్నారెడ్డి రచించిన 'స్వప్న సాగరం' నవలను వీసీ ఆచార్య కంచర్ల గంగాధరరావు ఆవిష్కరించారు. వర్సిటీలో మంగళవారం ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. తొలిప్రతులను వర్సిటీ రెక్టార్ కే రత్నషీలామణి, రిజిస్ట్రార్ జి.సింహాచలం, ఆర్ట్స్, కామర్స్, లా కళాశాల ప్రాచార్యులు ఎం.సురేష్ కుమార్‌లకు అందించారు. వీసీ గంగాధరరావు మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో సర్వీస్ కమిషన్ గ్రూప్ వన్ ఉద్యోగాన్ని కాదని వర్సిటీలో ఆచార్యునిగా సేవలందిస్తూ తన రచనలతో సమాజాన్ని చైతన్యవంతం చేస్తున్న గుజ్జు చెన్నారెడ్డి సేవలు వెలకట్టలేనివని ప్రశంసించారు. నేటి యువత పుస్తక పఠనాన్ని అలవర్చుకుంటేనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని చెప్పారు. చెన్నారెడ్డి రచనలు అందుకు ఎంతగానో దోహదం చేస్తాయని సూచించారు. రెక్టార్ రత్నషీలామణి మాట్లాడుతూ చెన్నారెడ్డి సాహిత్య రంగంలో చేస్తున్న రచనలు చారిత్రక పరిశోధనాత్మకంగా సాగుతూ వర్తమాన పరిస్థితులపై భవిష్య దిక్సూచిగా ఉంటాయని ప్రశంసించారు. వర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య జి.సింహాచలం మాట్లాడుతూ చెన్నారెడ్డి ఇప్పటికే 215 పరిశోధక వ్యాసాలు రాసి తన ఆధ్వర్యంలో 42 డాక్టరేట్లను పూర్తి చేయించారన్నారు.

వైఎస్సార్ సీపీలో చేరిక



కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న డాక్టర్ ఈవూరు గణేష్

రేపల్లె రూరల్: నగరం మండలం గొడపాలెం గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు బెల్లంకొండ నాగరాజు మంగళవారం వైఎస్సార్ సీపీలో చేరారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ఇంకొల్లు రామకృష్ణ సమక్షంలో చెరుకుపల్లి మండలం గుళ్ళపల్లిలోని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ ఈవూరు గణేష్ కార్యాలయంలో ఈ కార్యక్రమం జరిగింది. డాక్టర్ గణేష్ పార్టీ కండువా కప్పి నాగరాజును పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీ అభివృద్ధికి పనిచేయాలని కోరారు. కార్యక్రమంలో చెరకుపల్లి మండల కన్వీనర్ దుండి వెంకట రామిరెడ్డి, ఎంప్లాయీస్ అండ్ పెన్షనర్స్ విభాగం అధ్యక్షుడు తుమ్మ రవికుమార్‌రెడ్డి, సాయిశ్రీనివాస్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇందిరానగర్ కాలనీలో మిన్నంటిన రోదనలు


ఎలక్ట్రీషియన్ రవీంద్ర, అతని భార్య, మనుమడు, మనుమరాలి అంత్యక్రియలు పూర్తి



ఒకే బాక్సులో ఉంచిన సాత్విక, షణ్ముఖ్ మృతదేహాలు

తెనాలి రూరల్: తెనాలి చెంచుపేట ఇందిరానగర్ కాలనీ రోదనలతో మిన్నంటింది. కృష్ణా జిల్లాలో సోమవారం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన నలుగురి మృతదేహాలు స్వస్థలం తెనాలికి మంగళవారం చేరుకున్నాయి. తెనాలికి చెందిన గిడుగు రవీంద్రమోహన్‌బాబు కుటుంబం కృష్ణా జిల్లా మోపిదేవి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవస్థానానికి వెళుతూ రోడ్డు ప్రమాదానికి గురవడం, ప్రమాదంలో రవీంద్ర సహా అతని భార్య, మనుమరాలు, మనుమడు మృతి చెందిన విషయం తెలిసిందే. మంగళవారం ఉదయం వారి భౌతికకాయాలు తెనాలి తీసుకొచ్చి ఇందిరానగర్‌లోని నివాసం వద్ద ఉంచారు. మృతదేహాలను చూసి బంధువులు, స్థానికులు కన్నీటి పర్యంతమయ్యారు. రోదనలతో ఈ ప్రాంతం మిన్నంటింది. మూడు నెలల షణ్ముఖ్‌తో పాటు అక్క సాత్విక మృతదేహాన్ని కూడా ఒకే మార్చురీ బాక్స్‌లో ఉంచారు. పక్కపక్కనే ఉన్న చిన్నారుల మృతదేహాలు చూసిన స్థానికులు బోరున విలపించారు. రామలింగేశ్వరపేట గురవయ్య కాలనీలోని శ్మశానవాటికలో సాయంత్రం అంత్యక్రియలు నిర్వహించారు. కాగా రవీంద్ర కొడుకు సందీప్, కోడలు పల్లవి విజయవాడలోని ప్రైవేటు వైద్యశాలలో చికిత్స పొందుతున్నారు.

కాశీ మహోత్సవంపై ప్రవచనం





ప్రవచనం చెబుతున్న సామవేదం షణ్ముఖశర్మ, హాజరైన భక్తులు

తెనాలి: స్థానిక రామలింగేశ్వరపేటలోని దుర్గాపార్వతీ సమేత రామలింగేశ్వరస్వామి దేవస్థానంలో శ్రీరామ నవమి మహోత్సవాల్లో భాగంగా పలు ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా మంగళవారం దేవస్థానం ప్రాంగణంలోని లలితాధామం వేదికపై ప్రముఖ ఆధ్యాత్మిక పండితుడు బ్రహ్మశ్రీ సామవేదం షణ్ముఖ శర్మ 'కాశీ మహోత్సవం'పై ప్రవచనం చెప్పారు. పెద్ద సంఖ్యలో విచ్చేసిన భక్తులు అద్యంతం భక్తిశ్రద్ధలతో ఆలకించారు. బ్రహ్మశ్రీ ములుకుట్ల విశ్వనాథ శర్మ, వేద పండితుడు విష్ణుభట్ల ఆంజనేయ శర్మ, ఆలయ అర్చకులు వడ్లమూడి రాఘవేంద్ర శివప్రసాద్ పాల్గొన్నారు. పుచ్చ శైలజ, గోపాలకృష్ణలు భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు.

ఆకట్టుకున్న రోబోటిక్స్ నమూనాలు



ప్రాజెక్టును తిలకిస్తున్న చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్

పెదకాకాని: వివా ది స్కూల్‌లో ఎడ్యుటెక్ ఇన్నోవేషన్ సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం ఏఐ, రోబోటిక్స్ ప్రాజెక్ట్ ఎక్స్‌పో నిర్వహించారు. ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్, 3డీ ప్రింటింగ్ వంటి అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి విద్యార్థులు రూపొందించిన నమూనాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. హ్యాండ్ రైటింగ్ మెషిన్, స్మార్ట్ మిర్రర్, ఆటోమేటిక్ ప్లాంట్ వాటరింగ్ సిస్టమ్ ఆకట్టుకున్నాయి. విద్యార్థులను చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్, తల్లిదండ్రులు అభినందించారు. వివా ప్రిన్సిపల్ చదలవాడ సరళ మాట్లాడుతూ ఆధునిక సాంకేతికతను విద్యార్థులకు అందించేందుకు ఈ కార్యక్రమం నిర్వహించామన్నారు. ఎడ్యుటెక్ ఇన్నోవేషన్ ప్రతినిధి కె. కళ్యాణ్ మాట్లాడుతూ భవిష్యత్ సాంకేతికతను విద్యార్థులకు అందించేలా 6 నుంచి 9వ తరగతి విద్యార్థులకు ప్రోగ్రాం రూపకల్పన చేశామన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్ ఎలిటి కమాండర్ కేఎస్ రావు, సీబీఎస్ఈ సంధానకర్త జ్యోతి మెటిల్డా, పీవైపీ సంధానకర్త కె.మాధవి, తల్లిదండ్రులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

వైభవంగా మహా కుంభాభిషేకం



ఆలయాన్ని సుందరంగా తీర్చిదిద్దిన దృశ్యం



విశేష అలంకరణలో స్వామి వారు

పొన్నూరు: పట్టణంలోని తెలగపాలెం శ్రీ కోదండ రామాలయం ప్రాంగణంలో మహా కుంభాభిషేకం మహోత్సవం, సీతారాముల వారి కల్యాణ వేడుకలు వైభవంగా సాగుతున్నాయి. కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఉదయం విశ్వక్సేన పూజ, పుణ్యాహం, పంచగవ్య ఆరాధన, పంచగవ్య ప్రాశన, వాస్తు పూజ, వాస్తుహోమం, ఉక్త హోమం, తీర్థ సంగ్రహణం, సాయంత్రం అగ్ని ధ్యానం, ఆరాధన, ఉక్త హోమాలు, కుంభ కళాన్యాసం, విశేష పూజ నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్, భక్తులు పాల్గొన్నారు. ఆలయ కమిటీ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

పక్షుల ప్రేమికుడీ రైతు!

పెదకాకాని: ఏడేళ్లుగా నిత్యం పక్షులకు ఆహారం అందించడం అలవాటుగా చేసుకున్నారు గుంటూరు జిల్లా పెదకాకానికి చెందిన రైతు ఉయ్యూరు జగన్మోహనరావు. నిత్యం ఇంటి నుంచి పొలం వద్దకు పలు రకాల పదార్థాలు తీసుకు వెళ్లి అందిస్తున్నారు. ఈ రైతు రోజూ పొలం వద్ద ఆయన కోసం అవి కూడా ఎదురు చూస్తూ ఉంటాయి.